సాక్షి నంద్యాల

శనివారం । 19 । అక్టోబర్ । 2024



బైక్ దొంగ దొరికాడు

పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న మోటారు సైకిళ్ల దొంగ ఎట్టకేలకు చిక్కాడు. రూ. 21.53 లక్షల విలువైన 23 బైక్‌లను ఆదోని పోలీసులు శుక్రవారం రికవరీ చేశారు. 8లో▸



శాస్త్రోక్తంగా ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, ఖడ్గమాల పూజలు జరిపించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.93
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.500
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,919
అవుట్ ఫ్లో	:36,799

న్యూస్‌రీల్

టెట్‌కు 36 మంది అభ్యర్థులు గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన టెట్(ఎస్‌ఏ-1, ఎస్‌ఏ-2)కు 36 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 160 మందికి గాను 134 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 60 మందికి గాను 50 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య విభిన్న విభాగాల్లో సేవలు అందించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోగా మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ జాతీయ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ సబిహా పర్వీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తును డాక్టర్ మహమ్మద్ మస్తాన్, డైరెక్టర్, సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ డోనెం .76-1, 6ఏ/1, 2 భవనిపురం విజయవాడ 520012 చిరునామాకు పోస్ట్ చేయాలన్నారు.

సర్టిఫికెట్లతో హాజరుకండి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శనివారం హోలీక్రాస్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి, సర్వశిక్ష అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ లలిత శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్స్‌తో పాటు గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం ఉన్న రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

సుంకేసుల నుంచి నీటి విడుదల

కర్నూలు సిటీ: సుంకేసుల రిజర్వాయర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర, వేదావతి నదుల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సుంకేసుల బ్యారేజీకి నీటి ప్రవాహం శుక్రవారం పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న నీటిని దృష్టిలో పెట్టుకొని కేసీ ఇంజినీర్లు బ్యారేజీకి చెందిన 10 క్రస్టుగేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి 43,560 క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కాలువకు 2095 క్యూసెక్కులు, గేట్ల ద్వారా దిగువకు 42,420క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అవినీతి ఈఓపై సస్పెన్షన్ వేటు

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానంలో అక్రమాలకు పాల్పడిన ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌పై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటు పడింది. భక్తుల నుంచి వివిధ రూపాలలో ఆలయానికి వచ్చిన నిధులను స్వాహా చేసినట్లు వెలుగు చూడటంతో దేవదాయ శాఖ విచారణ చేపట్టింది. విచారణలో రూ.1.30 కోట్లను తమ సొంత ఖాతాకు మళ్లించినట్లు నిర్ధారణ అయినట్లు నివేదికను అధికారులు అందజేశారు. దీంతో రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లైఫ్ యువనేత్ర సేవా సమితికి అవార్డు



అవార్డు అందుకుంటున్న సమితి సభ్యులు


బేతంచెర్ల: స్థానిక లైఫ్ యువ నేత్రా సేవా సమితికి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ రాష్ట్ర స్థాయి అవార్డు ప్రదానం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 364 మందితో నేత్రదానం చేయించినందుకు గానూ ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ అధినేత జీఎన్ రావు..బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు పవన్ కుమార్, అక్బర్ హుసేన్, పవన్ కుమార్, విజేయంద్రా రెడ్డిలకు రాష్ట్ర స్థాయి అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న సభ్యులను లైఫ్ కన్వీనర్ రవికుమార్, కార్యదర్శి శ్రీనివాసులు అభినందించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈఓ శామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 25వ తేది వరకు గడువు పెంచారన్నారు. 10వ తరగతి అడ్మిషన్‌కు 14 ఏళ్లు, ఇంటర్మీడియెట్‌కు 15 ఏళ్లు వయస్సు ఉండాలన్నారు. పూర్తి సమాచారం కోసం www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ లేదా దగ్గరలోని స్టడీ సెంటర్లలో సంప్రదించాలని ఆయన వెల్లడించారు.

సార్.. పైసల్లేవ్!

నంద్యాల బాలికోన్నత పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



ప్రభుత్వ పాఠశాలలు చతికిలబడుతున్నాయి. బడుల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేయడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారం కావడం లేదు. బోర్డుపై రాసేందుకు చాక్ పీసుల్లేవు. రాసిన అక్షరాలు తుడిపేందుకు డస్టర్లు ల్లేవు.. మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు రసాయన ద్రావణాల్లేవు. విద్యుత్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. చిన్న చిన్న అవసరాలకు ఉపాధ్యాయులే సొంతంగా భరించాల్సి వస్తోంది.

- సర్కారీ పాఠశాల నిర్వహణ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం
- నాలుగు నెలలుగా నయాపైసా విదిల్చని ప్రభుత్వం
- సుద్దముక్కలు.. సబ్బుబిళ్లలకూ వెతుకులాటే!
- ఎంఈఓలు, హెచ్‌ఎంలపై భారం
- చిన్నపాటి మరమ్మతులకు ఇబ్బందులే
- జిల్లాకు రావాల్సిన నిధులు సుమారు రూ. 5 కోట్లు పైనే

జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

పాఠశాల స్థాయి	మొత్తం	విద్యార్థులు
ప్రాథమిక	962	70,245
ప్రాథమికోన్నత	194	25,102
హైస్కూల్	285	1,00,854

ఆళ్లగడ్డ/నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ భారంగా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు మాసాలు కావస్తున్నా సుద్ద ముక్క కొనుగోలుకు చేతిలో చిల్లిగవ్వ లేని దుస్థితి. ఏటా విద్యా బోధనకు అవసరమయ్యే సామగ్రి, సమావేశాలకు అవసరమయ్యే ఖర్చులు, చైతన్య కార్యక్రమాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, బెంచీలు, తలుపుల మరమ్మతులు తదితర వాటి నిర్వహణకు ప్రారంభంలో నిధులు కేటాయించడం ఆనవాయితీ. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఒక్క రూపాయి కూడా కాంపోజిట్ గ్రాంట్ విడుదల చేయలేదు. దీంతో పాఠశాలల నిర్వహణ భారం ప్రధానోపాధ్యాయులపై పడుతోంది. జిల్లాలోని 1,441 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,96,201 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాంపోజిట్ గ్రాంట్ విడుదల కాకపోవడంతో పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పన కష్టమవుతోంది. రిజిస్టర్లు, చాక్‌పీస్‌లు, డస్టర్లు, అవసరమైన ఇతర చిన్న చిన్న వస్తువుల కొనుగోలుకు నిధులు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు సొంత నిధులు వెచ్చించి అత్యవసరమైన సౌకర్యాలు కల్పించుకుంటున్నారు. పాఠశాల నిర్వహణతో పాటు కాంప్లెక్స్ స్కూళ్లుగా గుర్తించిన వాటికి, ఎమ్మార్సీ కార్యాలయాల నిర్వహణకు ఏటా నిధులు కేటాయిస్తారు. వీటిని ప్రధానోపాధ్యాయుల సమావేశాలు, వివిధ కార్యక్రమాలు, ఎమ్మార్సీ స్టేషనరీ ఖర్చు, తదితర వాటి కోసం వినియోగించాలి. ఇప్పటికే రెండు దఫాలుగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. సమావేశానికి హాజరయ్యే ఉపాధ్యాయులకు, అధికారులకు టీ, బిస్కెట్, స్నాక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ నిధులు అందుబాటులో లేక ఆ నిర్వహణ భారం సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలపై పడింది. నిధులు విడుదల చేయక పోవడంతో ఎంఈవోలు పాఠశాలల సందర్శన పూర్తి స్థాయిలో చేయలేక పోతున్నారు.



గోపాలపురం ఎంపీపీ పాఠశాల

లోపించిన పరిశుభ్రత..

ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఒక్కొక్కరు రూ. 4 వేల నుంచి 5 వేల వరకు, 150 మందికి పైగా పిల్లలు ఉన్న పాఠశాలల్లో సగటున ఒక్కో ఉపాధ్యాయుడు రూ. 10 వేల వరకు సొంత డబ్బులు ఖర్చు పెట్టారు. ఆ బిల్లు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రత లోపించి దుర్వాసన వ్యాపిస్తోంది. అనేక పాఠశాలల విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో విద్యుత్ శాఖ సిబ్బంది పాఠశాలల చుట్టూ తిరుగుతున్నారు. బిల్లు చెల్లించకుంటే కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ కట్ చేస్తే ఫ్యాన్లు, టీవీలు, కంప్యూటర్లు పని చేయవని ప్రధానోపాధ్యాయులు తమ జేబులో డబ్బులను వెచ్చించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

'శిక్షా' సప్తాహ్..

పాఠశాల నిర్వహణకు ఒక్క పైసా కూడా విడుదలకాక చేతి చమురు వదిలించుకుంటున్న హెచ్‌ఎంలకు గోరుచుట్టుపై రోకలి పోటులా శిక్షా సప్తాహ వారోత్సవాలు మరింత భారంగా మారాయి. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. టీఎల్‌ఎం (బోధనా పరికరాలు) తయారు చేయాలి. విద్యార్థులకు భోజనాలు పెట్టాలి. ఈ పనులకు దాతలు ఎవరూ సహకరించక పోవడంతో ఉపాధ్యాయులే తలో రూ. 500 నుంచి రూ. 100 వరకు వేసుకోవాల్సి వచ్చింది.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏటా పాఠశాలకు నిధుల విడుదల ఇలా..

విద్యార్థుల సంఖ్య	నిధుల మంజూరు
1-20	రూ.10 వేలు
21 నుంచి 30	రూ.15 వేలు
31 నుంచి 100	రూ.20 వేలు
101 నుంచి 250	రూ.50 వేలు
251-1000	రూ.75 వేలు
1000కి పైగా ఉంటే	రూ.లక్ష

ఇబ్బందులు పడుతున్నాం



ఈ ఏడాది ఇంతవరకు పాఠశాల గ్రాంటు రాలేదు. ప్రతి పనికి చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే చేతి నుంచి సుమారు రూ. 3 వేల వరకు ఖర్చు పెట్టాం. పాఠశాలకు వచ్చేది అంతా నిరుపేద విద్యార్థులే. వారికి అన్ని ఉచితంగానే సమకూర్చాలి. నిధులు ఒక్క రూపాయి కూడా రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– రమణయ్య, హెచ్‌ఎం, ఎంపీపీ స్కూల్, పేరాయిపల్లె

నిధులు వెంటనే విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల నిర్వహణపై దృష్టి సారించాలి. ఇంత వరకు మెయింటెనెన్స్ గ్రాంటు రూపాయి కూడా రాలేదు. నిర్వహణకు చాలా ఖర్చు అవుతోంది. విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే లైన్ కట్ చేస్తారు. ప్రస్తుతం కరెంట్ లేకుంటే ఏ పని జరగదు. ఇప్పటికైనా నిధులు వెంటనే విడుదల చేయాలి.

– కిశోర్, యూటీఎఫ్, జిల్లా కార్యదర్శి

నిధులు మంజూరు కావాల్సి ఉంది



పాఠశాల నిర్వహణ నిధులు ఈ ఏడాది ఇంకా మంజూరు కాలేదు. గతంలో అమ్మఒడి నుంచి కొంత మొత్తాన్ని మినహాయించి వాటిని అందజేసేవారు. ఈ ఏడాదికి సంబంధించిన నిధులు త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది. అవి వచ్చిన వెంటనే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమచేస్తాం.

– లలితకుమారి, సమగ్రశిక్ష జిల్లా అధికారి, నంద్యాల

శ్రీశైలం దేవస్థాన ఈఓ బదిలీ

- ఇన్‌చార్జ్ ఈఓగా సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు



డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థాన కార్య నిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న డి.పెద్దిరాజును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. డి.పెద్దిరాజును తన మాతృ సంస్థ అయిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారిగా దేవస్థాన సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. డి.పెద్దిరాజు డిప్యూటేషన్‌పై గత సంవత్సరం సెప్టెంబరు 25న శ్రీశైల ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలపరిమితి పూర్తవడంతో ఆయన బదిలీ అవుతారని ప్రచారం జరిగింది. అయితే ఊహించని విధంగా ఆయననే ఈఓగా కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన పది రోజులకే తిరిగి ఆయనను బదిలీ చేయడం కొసమెరుపు. అయితే శ్రీశైల దేవస్థానంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఉన్నప్పటికీ సహాయ కమిషనర్‌కు ఇన్‌చార్జ్ ఈఓగా బాధ్యతలు అప్పగించడంతో క్షేత్రంలో చర్చ కొనసాగుతోంది.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది.. మ్యూచువల్ ట్రాన్స్‌ఫార్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీకి విన్నవించుకున్నారు. పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు



దొర్నిపాడు సమీపంలో మిర్చి పొలంలో వర్షపునీరు

నంద్యాల(అర్బన్): నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రోడ్లు జలమయమై చెట్లు విరిగిపడ్డాయి. అత్యధికంగా కోవెలకుంట్ల మండలంలో 19.2 మి.మీ వర్షం కురవగా మహానంది 14.2, సంజామల 13.2, ఉయ్యాలవాడ 12.0, కొలిమిగుండ్ల 11.6, పాములపాడు 9.4, చాగలమర్రి 7.8, ఆళ్లగడ్డ 7.0, నంద్యాల 3.6, శ్రీశైలం 3.4, బండిఆత్మకూరు 3.2, నందికొట్కూరు 2.4, దొర్నిపాడు 2.0, శిరివెళ్ల 1.8, జూపాడుబంగ్లా 1.4, డోన్ 1.2, పాణ్యం 1.0, బనగానపల్లె, వెలుగోడు 0.8, పగిడ్యాల 0.6, ప్యాపిలి 0.2 మి.మీ వర్షం కురిసింది.



కమనీయం... పవిత్రోత్సవం

పవిత్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున మూలవిరాట్ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం అర్చనలు, హారతులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. పవిత్ర యాగశాలలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదు స్వాములను కొలువుంచి నవకలశ స్నపనం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి మంగళ వాయిద్యాల మధ్య మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: నిధులున్నా అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు ఎందుకు పూర్తి చేయడం లేదని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, సీడీపీఓలతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 439 అంగన్‌వాడీ కేంద్రాల్లో 231 టాయిలెట్లు, 425 తాగునీటి పైప్‌లైన్ పనుల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.55 కోట్లు విడుదల చేసినా.. ఎందుకు ఆలస్యం చేస్తున్నారన్నారు. గత సమావేశంలో 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించినా 25 శాతం కూడా పూర్తి చేయలేకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన నిర్మాణాలకు బిల్లులు వెంటనే పంపాలన్నారు. వర్షాలు పడుతున్నాయని, మెటీరియల్ తెప్పించుకుంటున్నామని, త్వరగా పూర్తి చేస్తామని రకరకాల కారణాలు చెప్పడం సరికాదన్నారు. డీఈలు బాధ్యతగా తీసుకొని అన్ని మండలాల ఏఈలతో పనులను చేయించాలన్నారు. సీసీ డ్రైన్ల నిర్మాణాలు కూడా పూర్తి చేయలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. 25 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల అవసరంలేదని చెప్తున్నారని, వాటికి బదులుగా వేరే అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

ఆళ్లగడ్డ.. ఇది నా అడ్డా!

- తీవ్ర వివాదాస్పదమవుతున్న ఎమ్మెల్యే అఖలప్రియ తీరు
- రోజూ ఏదో ఒక విషయాన్ని పట్టుకుని లొల్లి
- విజయ డెయిరీలోనూ రాజకీయం చేసేందుకు విఫలయత్నం
- తాజాగా ఏవీ సుబ్బారెడ్డితోనూ జగడం



సాక్షి, నంద్యాల: ఎమ్మెల్యే అఖిలప్రియ సొంత పార్టీ నేతలనే ఇబ్బందులకు గురిచేస్తూ నిత్యం వార్తల్లోకి ఎక్కుతున్నారు. ప్రతీ విషయంలోనూ తలదూర్చి వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ తలనొప్పిగా మారుతున్నారు. రెడ్ బుక్‌లో వంద మంది పేర్లున్నాయని, ఎవరినీ విడిచిపెట్టేది లేదంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులను బహిరంగంగా బెదిరించిన ఆమె.. నియోజకవర్గంలో ఏ పనులు చేయాలన్నా తన వద్దకు రావాలని సొంత పార్టీ వారికి కూడా డైరెక్ట్‌గా చెప్పేస్తున్నారు. సొంతంగా పనులు చేసుకునే వారిపైకి అధికారులను ఉసిగొల్పుతున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

మద్యం షాపులన్నింటిలో వాటా..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 18 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో మెజార్టీ షాపులు ఎమ్మెల్యే అనుచరులకే దక్కాయి. ఇరిగెల వర్గానికి 5, ఏవీ సుబ్బారెడ్డి వర్గానికి 1 తప్ప.. మిగిలినవి తటస్థులు దక్కించుకున్నారు. అయితే ప్రతీ షాపు నుంచి సేల్స్‌ను బట్టి నెలకు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఏ పార్టీ వారైనా మామూళ్లు ఇచ్చిన తర్వాతే వ్యాపారం చేసుకోవాలని, లేదంటే బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నట్లు దుకాణదారులు వాపోతున్నారు. ఎన్నికల ముందు జనసేనలో చేరి అఖిల విజయానికి చేయూతనిచ్చిన ఇరిగెల కుటుంబాన్ని కూడా దగ్గరకు రానివ్వడం లేదు. మద్యం లైసెన్స్ దక్కించుకున్న ఇరిగెల వర్గీయులకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోవైపు ఏవీ సుబ్బారెడ్డితో నిత్యం కయ్యానికి కాలు దువ్వుతున్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నుంచి మొదలైన దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఏవీ సుబ్బారెడ్డి ఆళ్లగడ్డకు వచ్చిన ప్రతీసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తేలా అఖిల వ్యవహార శైలి ఉన్నట్లు సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ఆళ్లగడ్డలో ఎవరు అడుగుపెట్టాలో.. ఎవరు అడుగు పెట్టొద్దో నిర్ణయించడానికి అఖిలకు ఉన్న అధికారం ఏంటని ఏవీ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు.

ఇసుక మాయం వెనుక..

జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో స్టాక్ పాయింట్ పెట్టి అక్కడి నుంచి లబ్ధిదారులకు అందజేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ప్రజాప్రతినిధి కన్ను ఇసుకపై పడింది. కొద్దికొద్దిగా ఇసుకను బయటకు తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికారులకు అనుమానం వచ్చి పరిశీలిస్తే సుమారు 600 టన్నులకు పైగా ఇసుకను తరలించారు. దీని విలువ సుమారు రూ.9 లక్షలు. ఇప్పటివరకు ఇసుకను రికవరీ చేయడమో.. లేక నిందితుల నుంచి డబ్బు వసూలు చేయడమో జరగాలి. కానీ హౌసింగ్ ఏఈని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసి ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు.

అధిష్టానానికి ఫిర్యాదులు

అఖిలప్రియ వ్యవహారశైలి, దుందుడుకు చర్యల వల్ల పార్టీకి తీరని నష్టం వాటిల్లుతున్నట్లు జిల్లా నాయకులు ఆ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. నిత్యం ఏదో ఒక అంశాన్ని లేవనెత్తుతూ రచ్చ చేస్తున్న అఖిలపై ఆ పార్టీ హైకమాండ్ కూడా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్పటికే అఖిలతో మాట్లాడినట్లు సమాచారం. దూకుడు తగ్గించుకోవాలని, పార్టీలో అందరిని కలుపుకుని వెళ్లాలని సూచించినట్లు సమాచారం. అయితే అధిష్టానం ఆదేశాలను సైతం అఖిలప్రియ పెడచెవిన పెట్టినట్లు టీడీపీలో చర్చ సాగుతోంది.

విజయ డెయిరీలోనూ రాజకీయమే

స్వార్థ రాజకీయాల కోసం విజయ డెయిరీని అఖిలప్రియ వదలడం లేదు. ప్రశాంతంగా ఉన్న నంద్యాలలో కూడా తన వ్యవహారశైలితో అలజడి రేపుతున్నారు. రెండు రోజుల క్రితం మందిమార్బలంతో డెయిరీలోకి ప్రవేశించి చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డిని ఫోన్‌లోనే బెదిరించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తన పరిధిలో లేని అంశంపై స్పందించాల్సిన అవసరం ఏమిటని, ఆళ్లగడ్డ నుంచి వచ్చి నంద్యాలలో రాజకీయాలు చేయడమేంటని టీడీపీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వీఓఏలకు హైకోర్టులో ఊరట

- తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ఆదేశాలు



మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో వీఓఏలు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా తొలగించిన వీఓఏ(బుక్‌కీపర్)లకు హైకోర్టులో ఊరట లభించింది. శుక్రవారం వీఓఏలు బనగానపల్లెలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని కనకాద్రిపల్లె, మీర్జాపురం, మదనంతపురం, ఎస్.చెన్నంపల్లె, పెట్నికోట, గొర్విమానుపల్లెతోపాటు పది గ్రామాల బుక్‌కీపర్లను తొలగించి ఇతరులను నియమించారు. 2022 డిసెంబర్‌లో ఆయా గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘాలు మూడేళ్లపాటు కొనసాగేలా తీర్మానం చేశారు. ఇంకా ఏడాదిన్నర సమయం ఉండగానే కూటమి ప్రభుత్వం వారిని తొలగించి అనుకూలమైన వారిని నియమించుకున్నారు. దాదాపు పదేళ్ల పైబడి నుంచి పని చేస్తున్నామని తమను అకారణంగా తొలగించారని బుక్‌కీపర్లు హైకోర్టును ఆశ్రయించారు. యథావిధిగా పాత వారినే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైకోర్టు నుంచి ఆర్డర్ కాపీలను ఉన్నతాధికారులకు అందజేశారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగల చోరీ నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఎస్ఐ ఓబులేసు

మిడుతూరు: విద్యుత్ తీగలు చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ఆరుగురు నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, వినయ్‌కుమార్, కొమ్ము దిలీప్, విజయరాజు, వెంకటేశ్వర్లు, రవీంద్ర తలముడిపి, అలగనూరు ఎస్ఆర్‌బీసీ కాలువ వెంట వ్యవసాయ మోటార్లకు వినియోగించే విద్యుత్‌వైర్‌ను చోరీకి పాల్పడ్డారు. వారం క్రితం ఎస్ఆర్‌బీసీ కాలువ వెంట అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా 35 మోటార్ల విద్యుత్ వైర్ చోరీ చేసినట్లు అంగీకరించారు. వారిని అరెస్ట్ చేసి, రూ.1.63 లక్షల విలువ చేసే వైరు, టన్ను ఐరన్, రెండు ఆటోలు, ఒక ద్వి చక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కలదాడిలో దుప్పి మృతి

ఆత్మకూరు రూరల్: మండలంలోని నల్లకాల్వ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ స్మృతివనంలో గురువారం రాత్రి కుక్కల దాడిలో దుప్పి మృతిచెందింది. విషయం తెలిసిన అధికారులు శుక్రవారం దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. రాత్రి పొద్దుపోయిన తరువాత స్మృతివనం వెనుక భాగంలోని వెలుగోడు నార్త్‌బీట్ అటవీ ప్రాంతం నుంచి ఒక దుప్పిని కుక్కలు తరుముతూ వచ్చాయి. అప్పటికే బాగా గాయపడిన దుప్పి వైఎస్ఆర్ స్మృతివనం కంచెను ఎగిరి లోపలికి వచ్చింది. అయినప్పటికీ కుక్కలు వదలక దుప్పిని చంపేశా యి. స్మృతివనం సెక్యూరిటీ గార్డులు డ్యూటీ మారే సమయం కావడంతో ఇది ఎవరూ గమ నించలేదు. తెల్లవారిన తరువాత విషయం తెలిసి వెలుగోడు ఎఫ్ఆర్‌ఓ ఖాన్.. వన్యప్రాణి వైద్యనిపుణులను పిలిపించి పోస్టుమార్టం చేయించి దుప్పి కళేబరాన్ని దహనం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన సుబ్బిశెట్టి కిరణ్(35) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. సుబ్బిశెట్టి కిరణ్ మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో ఆరోగ్యం క్షీణించింది. మరోవైపు అప్పుల పాలయ్యాడు. దీంతో గురువారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. భార్య ప్రేమమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుత సంచారం



వెల్దుర్తి సమీపంలోని పొలాల్లో పాదముద్రలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలోని సుబ్బయ్య తాత దేవాలయానికి వెళ్లే దారిలో చిరుతపులి జాడలు కనిపించాయి. గురువారం ఆ ప్రాంతంలోని పొలాల్లో పని చేస్తున్న కొందరు రైతులు చిరుతపులి జింకను వెంబడించడాన్ని గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. వారు శుక్రవారం ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చారు. శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి పాద ముద్రలు పరిశీలించి, అవి చిరుతవో కాదో నిర్ధారిస్తామని వెల్దుర్తి ఫారెస్టు అధికారి రామచంద్రుడు తెలిపారు.

దర్జాగా సబ్‌లీజ్

- పసుపుల పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో మద్యం షాపు
- సహకార సంఘం అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా కట్టబెట్టిన లీజుదారుడు
- షాపింగ్ కాంప్లెక్ ఎదురుగా మసీదు, మరోవైపు లేడీస్ హాస్టల్
- 48 గంటల్లో మద్యం షాపును ఖాళీ చేయాలని సహకార శాఖ అధికారుల నోటీసు
- ససేమిరా అంటున్న లిక్కర్‌షాపు యజమాని



పసుపల పీఏసీఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): నిబంధనలకు విరుద్ధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన దుకాణాన్ని ఓ వ్యక్తి ఏకంగా మద్యం దుకాణం నిర్వహణకు సబ్ లీజ్ ఇచ్చేశాడు. మూడేళ్ల అగ్రిమెంటుపై ఏడాది కిత్రం అద్దెకు తీసుకొని ఈ ఘనకార్యం చేశాడు. విషయం తెలుసుకున్న సహకార శాఖ అధికారులు, జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కర్నూలు శివారులోని వెంకాయపల్లి ఎల్లయ్య దేవాలయం సమీపంలో ప్రధాన రహదారిపై పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించింది. ఏడాది క్రితం దీనిని ప్రారంభించారు. ఇందులో 4 షాపులను జగదీశ్వరరెడ్డి అనే వ్యక్తికి 3 ఏళ్ల అగ్రిమెంటుపై అద్దెకు ఇచ్చారు. ఆది దివ్య ఎంటర్‌ప్రైజెస్ పేరుతో అతను సిమెంటు హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నారు. అద్దెకు ఇచ్చి ఏడాది గడుస్తోంది. అద్దెకు తీసుకున్న నాలుగు షాపుల్లో మూడు షాపులు తాను వ్యాపారం చేసుకుంటూ ఒక వైపునకు ఉన్న మరో షాపును నిబంధనలకు విరుద్ధగా టీడీపీ వర్గీయులకు మద్యం దుకాణం కోసం సబ్ లీజుకు ఇచ్చాడు. ఈ దుకాణం పక్కన ఖాళీ ప్రదేశం కూడా ఉండటంతో మినీ బార్‌గా నిర్వహించుకోవడానికి మద్యం షాపు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

48 గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన దుకాణాలను అద్దెకు తీసుకున్న వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లో ఇతరులకు సబ్ లీజుకు ఇవ్వరాదనే షరతు ఉంది. దీనిని ఉల్లంఘించి జగదీశ్వరరెడ్డి అనే వ్యక్తి లిక్కర్ వ్యాపారానికి సబ్‌లీజ్‌కు ఇవ్వడాన్ని సహకార శాఖ అధికారులు, జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధికారులు తీవ్రంగా పరిగణించారు. కృష్ణానగర్ బ్రాంచీ అధికారులు, పసుపల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంతరెడ్డి వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌కు వెళ్లి వివరాలు ఆరా తీశారు. 48 గంటల్లో మద్యం షాపును ఖాళీ చేయాలని నోటీసు ఇచ్చారు. అయితే, ఖాళీ చేసేందుకు మద్యం షాపు నిర్వాహకులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే మద్యం షాపు నిర్వాహకుల వెనుక టీడీపీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. సబ్ లీజుపై మద్యం షాపు కొనసాగితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని షాపులను అద్దెకు తీసుకున్న వారు సబ్ లీజుకు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నిబంధనలను ఉల్లంఘించి సబ్ లీజుకు ఇచ్చిన జగదీశ్వరరెడ్డికి కూడా నోటీసు ఇచ్చినట్లు తెలుస్తోంది.

మసీదు, లేడీస్ హాస్టల్ సమీపంలోనే మద్యం షాపు ఏర్పాటుపై ఆందోళన

నిబంధనల ప్రకారం మసీదు, దేవాలయం, పాఠశాల వంటి వాటికి 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం షాపు ఏర్పాటు చేయరాదు. ఇక్కడ ఏర్పాటు చేసిన మద్యం షాపునకు ఎదురుగా 100 మీటర్లలోపే మసీదు ఉంది. 300 మీటర్లదూరంలో లేడీస్ హాస్టల్ ఉంది. మద్యం దుకాణం పక్క నుంచే మహిళలు హాస్టల్‌కు వెళ్లాల్సి ఉంది. 500 మీటర్లలో ఎల్లమ్మ దేవాలయం కూడా ఉంది. ఇలాంటి ప్రదేశంలో మద్యం షాపు పెట్టుకోవడానికి ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

సీఎం గారూ హైకోర్టు బెంచ్ మరిచారా?



జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి

కర్నూలు (లీగల్): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయం మరిచిపోయినట్లున్నారని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై కేబినెట్ మీటింగ్‌లో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని గత నెలలో ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. అయితే, ఇప్పటి వరకు దానిని ఆచరణలో పెట్టకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ప్రతినిధులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి పెంచి కేబినెట్ సమావేశం ఏర్పరచి హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అంగీకారం తెలుపుతూ కేంద్రానికి లేఖ రాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో ప్రస్తుత ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వట్టి మాటలను కట్టిపెట్టి గట్టి మేలు తలపెట్టేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

మా ఊరిలో వైన్ షాప్ వద్దు

- అధికారులకు కౌలురు గ్రామస్తులు వేడుకోలు



పాణ్యం పోలీసు స్టేషన్ వద్ద కౌలురు గ్రామస్తులు

పాణ్యం: తమ గ్రామ పరిధిలో వైన్‌షాప్ ఏర్పాటు చేయరాదని కౌలురు గ్రామ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. బలపనూరు మెట్ట–కౌలురు గ్రామం మధ్యలో వైన్‌షాప్ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి ఈ మార్గంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వస్తుంటారని వైన్‌షాప్ ఏర్పాటుతో వారికి ఇబ్బంది అవుతుందని చెప్పారు. అయితే, నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం రాత్రి పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ అభ్యంతరం తెలియజేశామని, ఆయన ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని కౌలురువాసులు తెలిపారు. సీఐని కలిసిన వారిలో కౌలురు గ్రామస్తులతో పాటు మలమహానాడు నాయకుడు దత్తు , ప్రజా సంఘాల నాయకుడు వెంకటాద్రి ఉన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

– నలుగురు నిందితులు అరెస్టు



మద్యం, నిందితులను చూపుతున్న డీఎస్పీ

డోన్ టౌన్: అక్రమంగా తరలిస్తున్న రూ.4 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం, బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ ఇంతియాజ్ బాషాతో కలిసి విలేకరులకు వెల్లడించారు. పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై వైఎస్ నగర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం ఉన్నట్లు గుర్తించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ఉన్న 80 బాక్సులు (ఒక్కో బాక్సులో 90 ఎంఎల్ పరిమాణం ఉన్న 7,680 టెట్రా ప్యాకెట్లు)ఉన్నట్లు గుర్తించారు. మద్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేసి, తుగ్గలి మండలం గుడిసె గుప్పరాళ్ల గ్రామంలోని వైఎస్ నగర్‌కు చెందిన ఈడిగ సురేంద్రగౌడ్, షేక్ దస్తగిరి, కృష్ణగిరి మండలం సంగాల గ్రామానికి చెందిన ఈడిగ హరిప్రకాష్‌గౌడ్, తుగ్గలికి చెందిన ఈడిగ మణికంఠ గౌడ్‌లను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, ఏఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని అర్బన్: తప్పించుకుని తిరుగుతున్న మోటార్ సైకిల్ దొంగ శుక్రవారం ఆదోని పోలీసులకు చిక్కాడు. ఆ దొంగ నుంచి రూ.21.53 లక్షలు విలువ చేసే 23 బైకులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ సోమన్న విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన రంగనాయకులు అలియాస్ కొమరంపులి ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. ఇటీవల ఆదోని పరిధిలో ఎక్కువగా ఇలాంటి చోరీలు జరగడంతో పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ నేతృత్వంతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదోనిలోని రాంజల రోడ్డులో ఓ వ్యక్తి ఏపీ 21సీసీ 4975 నంబర్ గల మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత విచారించగా మొత్తం 23 బైక్‌లు చోరీ చేసినట్లు రంగనాయకులు అంగీకరించారు. దీంతో దొంగపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. బైక్ చోరీల కేసును ఛేదించిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, పోలీసులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు నగదును అందజేస్తున్న ఎస్పీ

నంద్యాల: టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన హోంగార్డు పిల్లలకు జిల్లా అదిరాజ్‌సింగ్ రాణా ప్రోత్సాహ బహుమతులు అందించారు. 2023–2024లో టెన్త్, ఇంటర్‌లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులకు రూ.2 వేలు, రూ.1,000 చొప్పున శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణంలో ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

విధి నిర్వహణలో అనారోగ్య కారణాల చేత మరణించిన హోంగార్డు హుసేన్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు తోటి హోంగార్డులందరూ కలిసి రూ.2 లక్షలు సేకరించారు. నగదును హుసేన్ భార్య షేక్ షహీనాకు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా చేతుల మీదుగా అందజేశారు.

దొంగ అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు (టౌన్): తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో దొంగతనాలు పెరిగాయి. ఇళ్లలో చోరీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. దీంతో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 17 వ తేదీ గురువారం కర్నూలులో అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని ప్రత్యేక టీమ్‌లు అదుపులోకి తీసుకున్నాయి. నిందితుడు ఫారూఖ్ నగర్‌లో నివసించే షేక్ అబ్దుల్ రహీమాన్, అలియాస్ అల్తాఫ్‌గా గుర్తించారు. విచారణలో అతను మరో ఇద్దరితో కలిసి ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 36 ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో నిందితుడి నుంచి 43 తులాల బంగారు నగలు, 279.7 తులాల వెండిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. దొంగతనాలకు సంబంధం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసి ఛేదించిన సీఐలు మురళీధర్ రెడ్డి, మధుసూదన్ గౌడ్‌తో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

30లోగా పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియ పూర్తి కావాలి

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విద్యార్థుల కొత్త రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి కోరారు.జిల్లాలోని అన్ని కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.కొత్తరిజిస్ట్రేషన్, రెన్యూవల్స్ చేసేందుకు సేవలనుhttp:// jnanabhumiv2. apcfs s. in వెబ్‌సైట్ పోర్టల్‌లో కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా కళాశాలల్లో స్కాలర్‌షిప్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆర్‌యూలో ఇంజినీరింగ్ విద్యార్థులకు కౌన్సెలింగ్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు కౌన్సెలింగ్ ఇచ్చారు. గురువారం అర్ధరాత్రి బీటెక్ జూనియర్ విద్యార్థి సునీల్‌పై 15 మందికి పైగా సీనియర్ విద్యార్థులు దాడి చేసి గాయ పరిచారు. శుక్రవారం రిజిస్ట్రార్ డాక్టర్ విజయ కుమార్ నాయుడు, వర్సిటీ హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆచార్య విశ్వనాథరెడ్డి బాధిత విద్యార్థి సునీల్‌ను రిజిస్ట్రార్ చాంబర్‌లోకి పిలిపించుకొని జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. సీనియర్ విద్యార్థులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థు ల తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో మరో సారి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి అండర్ టేకింగ్ తీసుకుంటామని రిజిస్ట్రార్ తెలిపారు. తాలూకా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీధర్ స్టేషన్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహిళ దారుణ హత్య

- మామే చంపాడంటూ మృతురాలి సోదరుడి ఫిర్యాదు



గొల్ల శిరీష (ఫైల్)



మహిళ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

నందికొట్కూరు: మండల పరిధిలోని నాగటూరు గ్రామ సమీపంలోని పొలంలో శుక్రవారం సాయంత్రం మహిళ దారుణ హత్యకు గురైంది. నాగటూరు గ్రామానికి చెందిన గొల్ల నరసింహులు, శిరీష (26) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా శుక్రవారం మొక్కజొన్న పొలం పనులకు వెళ్లిన శిరీషను సొంత మామ గొల్ల కురుమన్న హత్య చేసినట్లు తెలుస్తోంది. పంట కోత కోసిన చేనులో కంకులు ఏరుతున్న సమయంలో బండరాయితో తలపై మోది హత్య చేసి అక్కడి నుంచి పరారైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతిరాలి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు మామపై హత్య కేసు, భర్త నరసింహులు, అత్త మహేశ్వరి, ఆడపడుచులపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు టౌన్ సీఐ తెలిపారు. కాగా గొల్ల కురుమన్నపై 2017లో ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్న కురుమన్నను ఎన్‌కౌంటర్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తల్లి హత్యకు గురికావడంతో పిల్లలు అనాథలయ్యారు.

యువకుడి మృతదేహం లభ్యం

మహానంది: రెండ్రోజుల క్రితం తెలుగుగంగ కాల్వలో పడి గల్లంతైన ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థి గౌతమ్ సిద్ధార్థ(18) మృతదేహం రుద్రవరం సమీపంలోని తుర్లేరు వద్ద శుక్రవారం లభ్యమైంది. రుద్రవరం పోలీసుల నుంచి మహానంది పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మూడు రోజులైనా ఏర్పాటు కాని మద్యం షాపులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో మూడురోజులైనా మద్యంషాపులు ఏర్పాటు కాలేదు. షాప్ పర్మిట్లు తెలంగాణ ప్రాంత వాసులు దక్కించుకోవడం.. వారికి షాపులు ఏర్పాటు చేసుకునే క్రమంలో స్థానిక సిండికేట్‌దారులు అడ్డంకులు సృష్టిస్తుండటంతో దుకాణాల ఏర్పాటు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మద్యం ప్రియులు సరిహద్దులో ఉన్న తెలంగాణకు వెళ్లి మద్యాన్ని కొనుగోలు చేస్తుండగా అక్కడి దుకాణదారులు క్వార్టర్‌పై రూ.30 చొప్పున ఎక్కువకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

మట్టిమిద్దె కూలి గాయాలు

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో మట్టి మిద్దె కూలి కుటుంబ సభ్యులు గాయాలపాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎరుకలి కాలనీకి చెందిన కోనేటి వెంకటేష్ అతని కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కు బాగా తడిసిన మట్టిమిద్దె రాత్రి కూలి కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.